నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ఉప్పల్: ఉప్పల్ – వరంగల్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలు తొలగిస్తున్నందున గురువారం ఉప్పల్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నిఖిల్ తెలిపారు. గురువారం 11కేవీ బోడుప్పల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 2.30 వరకు ఉప్పల్ మెయిన్ రోడ్డు, కుమ్మరి బస్తీ, శ్రీరామ కాలనీ, టీఎక్స్ ఆస్పత్రి, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

పాఠశాలల్లో వసతులు కల్పించాలంటూ వినతి



పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని కోరుతూ మల్కాజిగిరి కార్పొరేటర్ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని, శానిటేషన్ కోసం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఉప్పటికీ ఉపాధ్యాయుల కొరత కూడా ఉందన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా నిధులు పెంచాలని కోరామన్నారు. చెరువుల అభివృద్ధితో పాటు సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

గౌతంనగర్ సమగ్రాభివృద్ధికి కృషి



వాణినగర్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీతరామuయాదవ్

గౌతంనగర్: డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ అన్నారు. గౌతంనగర్ డివిజన్ వాణినగర్‌లో కొనసాగుతున్న నాలా నిర్మాణ పనులను, సాయినగర్‌లో కొనసాగుతున్న రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను బుధవారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, ఏఈ దివ్యజ్యోతి, స్థానిక నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అభివృద్ధి పనులపై బుధవారం మల్లాపూర్ వార్డు కార్యాయంలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ కాప్రా ఈఈ హరిలాల్, డీఈ రూప, ఏఈ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి



అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో ఇన్‌చార్జీ డీసీ మల్లారెడ్డి, కార్పొరేటర్లు శాంతి, సబిత

అల్వాల్: వర్షాకాలం నేపథ్యంలో అల్వాల్ సర్కిల్ ఇన్‌చార్జీ డీసీ మల్లారెడ్డి బుధవారం కార్పొరేటర్లు, అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జీ డీసీ మల్లారెడ్డి మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సబితఅనిల్‌కిషోర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరద నీరు సాఫీగా వెళ్లేందుకు మరో లైన్ వేస్తాం



వీరారెడ్డినగర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: వీరారెడ్డినగర్ కాలనీలో వర్షపు నీరు నిల్వకుండా చూడాలని అధికారులకు నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ సూచించారు. బుధవారం వీరారెడ్డినగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల పిలుపు మేరకు కార్పొరేటర్ కాలనీలో పర్యటించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్న వర్షానికే వీరారెడ్డినగర్ కాలనీలో వరద నిలుస్తోందని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. నీరు సాఫీగా వెళ్లేందుకు మరోలైన్ కూడా వేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ రూప, నాచారం ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, స్థానిక నేతలు మేకల ముత్యంరెడ్డి, శివకుమార్, గంగాధర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆటలకు టాటా.. ఇక బడిబాట

- ఉత్సాహంగా ప్రారంభమైన పాఠశాలలు
- అందుబాటులోకి పుస్తకాలు, నోట్‌బుక్స్
- పలు స్కూళ్లలో పూర్తికాని మేజర్, మైనర్ పనులు



ఓల్డ్ అల్వాల్‌లో.. బాలికల ఉన్నత పాఠశాల



మల్లాపూర్‌లో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

మల్కాజిగిరి/అల్వాల్: ఆటలు, పాటలతో వేసవి సెలవులు సరదాగా ముగిశాయి. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు పాఠశాలల బాట పట్టారు. మొదటి రోజు ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల్లో హాజరు శాతం అంతంగా మాత్రమే నమోదైంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సుమారు 89 శాతం పుస్తకాలు, నోట్‌బుక్స్ అందాయి. మొదటి రోజే యూనిఫామ్స్ అందజేస్తామని ప్రభుత్వం చెప్పినా ఇంకా కొన్ని స్కూళ్లకు చేరుకోలేదు.

- మల్కాజిగిరి మండల పరిధిలో 18 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత, 5 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 4,372 మంది విద్యార్థులు ఉండగా 1251 మంది విద్యార్థులు హాజరయ్యారు.
- మల్కాజిగిరి మండల పరిధిలో 2024–25 సంవత్సరంలో ఇప్పటి వరకు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు(8, 9, 10 తరగతులు మినహాయించి) 53 మంది కొత్త విద్యార్థులు బడిలో చేరారు.
- మల్కాజిగిరి బాలుర పాఠశాలలో విద్యార్థులకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పొన్నాల సుజాత, ప్రధానోపాధ్యాయుడు వీరేశం పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.
- అల్వాల్ మండల పరిధిలో 17 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 6 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 3,993 మంది విద్యార్థులు ఉండగా 1,205 మంది విద్యార్థులు హాజరయ్యారు.
- అల్వాల్ మండల పరిధిలో 2024–25 సంవత్సరంలో ఇప్పటి వరకు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 78 మంది కొత్త విద్యార్థులు బడిలో చేరారు.
- బాలికల ఉన్నత పాఠశాల అల్వాల్‌లో పాఠశాల డైరీని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో పుస్తకాలను పంపిణీ చేశారు. యూనిఫామ్స్ ఒకటి రెండు రోజుల్లో అందజేస్తామని, మొదటి రోజు 70 శాతం మంది హాజరయ్యారని హెచ్ఎం సంధ్యారాణి తెలిపారు.

బడీడు పిల్లలంతా బడిలో ఉండాలి



చిలుకానగర్ స్కూల్‌లో పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: బడిబాట కార్యక్రమంలో భాగంగా స్కూల్స్ ప్రారంభం రోజును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ విద్యార్థులకు స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్నారిని పాఠశాలలో చేర్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మౌలిక సదుపాయల కల్పనకు అన్ని చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్, ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడిబాట అంతంత మాత్రమేనా..?

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నామని విద్యార్థులకు అనువైన వాతావరణం కల్పిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా మాటలు చేతల రూపంలో కనిపించడంలేదు. మల్కాజిగిరి, అల్వాల్ మండల పరిధిలో బడిబాట కార్యక్రమం అంతంత మాత్రంగానే నిర్వహించారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏదో మొక్కుబడిగా కార్యక్రమాన్ని ఉన్నతాధికారులు ప్రారంభించి చేతులు దులుపుకుంటున్నారే తప్ప బడిమానేసిన విద్యార్థులతో పాటు, కొత్తగా విద్యార్థులను పాఠశాలలకు రప్పించడంలో అధికారులు, ఉపాధ్యాయులు విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఇంకా పూర్తి కాని నాడు, నేడు పనులు

మల్కాజిగిరి మండల పరిధిలో గతేడాది మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా 9 పాఠశాలలు ఎంపిక కాగా రెండు పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగిలిని వాటిని నాడు, నేడు కార్యక్రమంలో చేర్చారు. నాడు నేడు కార్యక్రమంలో భాగంగా 14 పాఠశాలల్లో మైనర్, మేజర్ పనులు, మూడు పాఠశాలల్లో పూర్తికాగా, మూడింటిలో పనులు మొదలు కాలేదు. విద్యుత్ పనులు దాదాపు పూర్తయ్యాయి. 14 పాఠశాలల్లో టాయిలెట్స్ మరమ్మతులకు నిధులు కేటాయించగా నాలుగు పాఠశాలల్లో పూర్తికాగా, ఆరు పాఠశాలల్లో దాదాపు పూర్తి కావచ్చాయి. మరో నాలుగు పాఠశాలల్లో ఇంకా ప్రారంభం కాలేదు.

- అల్వాల్ మండల పరిధిలో గతేడాది మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా 11 పాఠశాలలు ఎంపికకాగా కేవలం రెండు పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగిలిన వాటిని నాడు నేడు కార్యక్రమంలో చేర్చారు. నాడు నేడు కార్యక్రమంలో భాగంగా 16 పాఠశాలలో మైనర్, మేజర్ పనుల్లో ఒకే పాఠశాలలో పూర్తికాగా, 8 పాఠశాలల్లో పనులు మొదలు కాలేదు. విద్యుత్ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఎంపిక చేసిన 16 పాఠశాలల్లో 9 పాఠశాలలకు నిధులు మంజూరు కాలేదు. మిగిలిన 7 పాఠశాలల్లో ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. బాలికల టాయిలెట్స్ కోసం ఆరు పాఠశాలలకు నిధులు మంజూరు కాగా నాల్గింటిలో ప్రారంభించలేదు.

కొన్ని స్కూళ్లలో సమస్యల తిష్ఠ

రామంతాపూర్: ఓ వైపు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు సకల సౌకర్యాలతో అడ్మీషన్ల కోసం విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. మరోవైపు రామంతాపూర్‌లో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు వివిధ బస్తీల్లో ఉన్న ఐదు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో అరకొర సౌకర్యాలు ఉన్నాయి. తగినన్ని తరగతి గదులు లేక సరిపడా టీచర్లు లేరు. సమస్యలు ఉన్నా వాటిని లెక్క చేయకుండా ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉరుకుల పరుగులతో కేరింతలు కొడుతూ ఉత్సాహంగా పాఠశాలలకు చేరుకున్నారు.



ప్రగతినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఉత్సాహంగా వచ్చిన విద్యార్థులు

హాజరు శాతం తక్కువే..

మల్లాపూర్: మల్లాపూర్, నాచారంలోని ప్రభుత్వం ప్రాథమిక జిల్లా పరిషత్ హైస్కూల్ పాఠశాలలు ప్రారంభమయ్యాయి, మొదటి రోజు విద్యార్థుల హాజరు శాతం తక్కువగానే ఉంది.



మల్కాజిగిరి బాలుర పాఠశాలలో పుస్తకాల పంపిణీ



నేరేడ్‌మెట్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో..



మల్కాజిగిరి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న చిన్నారులు

పదవులే లక్ష్యం.. సమస్యలపై నిర్లక్ష్యం

బోడుప్పల్‌లో మూడు మాసాలుగా అటకెక్కిన పనులు

- స్తంభించిన పాలన.. ముందుకు సాగని పనులు
- నెల రోజుల నుంచి అవిశ్వాసం పనిలో కార్పొరేటర్లు
- స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతున్న తీవ్ర నిరసనలు



బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో మూడు మాసాలుగా పాలన స్తంభించింది. మార్చి మాసంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ ప్రారంభం కాగా ఆ పనుల్లో మున్సిపల్ అధికారులు బిజీ అయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి నెల రోజుల పాటు క్యాంప్‌నకు వెళ్లారు. దీంతో కాంగ్రెస్‌లో ఉన్న 21 మంది కార్పొరేటర్లు అందుబాటులో లేకపోగా, ప్రస్తుత మేయర్, డిప్యూటీ మేయర్ కోర్టు పనుల్లో బిజీ అయ్యారు. దీంతో గడిచిన మూడు మాసాలుగా పాలన స్తంభించి పోయింది. ఎక్కడ పనులు అక్కడ పేరుకుపోగా, స్థానిక ప్రజల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల పనుల్లో అధికారులు బిజీ..

ఎన్నికల కోడ్ ప్రారంభమైన మార్చి 18వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల పనుల్లో అధికారులు బిజీగా ఉన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 72 పోలింగ్ బూత్‌లున్నాయి. ఎన్నికల కోడ్ ప్రారంభం నుంచి ఎన్నికల కోసం కేటాయించిన బూత్ లెవెల్ ఆఫీసర్లు ఓటర్ల లిస్టులను రూపొందించడం, ఎన్నికల విధుల్లో భాగంగా ఓటరు లిస్టు సవరణ, అలాగే ఫామ్ నంబరు 6, 7, 8 ప్రకారం ఓటరు లిస్టులో మార్పులు, చేర్పులు, సవరణ చేయడం జరిగింది. ఫైనల్ లిస్టు వచ్చిన తర్వాత నగర పౌరుల సమాచారం మేరకు నోటీసు బోర్డుపై సమాచారం ఉంచారు. ప్రతి 10 బూత్ లెవెల్ ఆఫీసర్‌కు ఒక సూపర్‌వైజర్ ఉండగా, వారిపై ఓటర్ నమోదు రిజిస్ట్రేషన్ అధికారిగా కమిషనర్ వ్యవహరించారు. ఎన్నికల కోసం కేటాయించిన అధికారులు ప్రతిరోజూ ఎన్నికల పనులు చూసుకుంటూ మున్సిపల్ విధులను కూడా నిర్వహించారు.

క్యాంప్‌నకు పరిమితమైన కార్పొరేటర్లు

పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు బిజీగా ఉండగా, ఆయా పార్టీలకు చెందిన కార్పొరేటర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికల పోలింగ్ అనంతరం అధికార కాంగ్రెస్ పార్టీలో ఉన్న 21 మంది కార్పొరేటర్లు ప్రస్తుత మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం కోరుతూ తీర్మానం చేశారు. మే నెల 21వ తేదీన కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చి క్యాంప్‌నకు వెళ్లారు. ప్రస్తుత మేయర్, డిప్యూటీ మేయర్‌ను తమ పదవుల నుంచి దించి తమ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లను మేయర్, డిప్యూటీ మేయర్లుగా ఎన్నుకోవాలని ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన 21 మంది కార్పొరేటర్లను దేశంలోనే వివిధ ప్రాంతాల్లో తిప్పుతూ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ప్రస్తుత మేయర్, డిప్యూటీ మేయర్లు, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల(చైర్‌పర్సన్/వైస్ చైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మాణం) రూల్స్, 2008లోని రూల్ 4ను పాటించలేదంటూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఏకీభవించిన కోర్టు జూన్ 6వ తేదీన జరగాల్సిన అవిశ్వాసాన్ని వాయిదా వేస్తూ జూన్ 12వ తేదీ వరకు కోర్టు స్టే విధించింది. దీంతో కోర్టు స్టేను వెకెట్ చేయించాలని అధికార కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు ప్రయత్నం చేస్తుండగా, తమ పదవులు యధావిధిగా ఉండాలని ప్రస్తుత మేయర్, డిప్యూటీ మేయర్ కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. బుధవారం హైకోర్టులో వాదనలు ఉండగా గురువారానికి వాయిదా వేశారు.

డివిజన్‌లో తిష్ట వేసిన సమస్యలు..

ఎన్నికల కోడ్ వల్ల 80 రోజుల పాటు పాలన స్థంబించి పోగా, అనంతరం అధికార పార్టీ కార్పొరేటర్లు క్యాంప్, ప్రస్తుత మేయర్, డిప్యూటీ మేయర్లు కోర్టు పనుల్లో బిజీగా ఉన్నారు. దీంతో డివిజన్ల పరిధిలో ఇంజినీరింగ్, విద్యుత్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాలకు సంబంధించిన పనులు పెండింగ్ పడుతున్నాయి. సకాలంలో పనులు జరగకపోవడంతో స్థానిక ప్రజల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కార్పొరేటర్లు ప్రజాసమస్యలను గాలికి వదిలేశారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు పదవులు పొందేందుకు ప్రయత్నిస్తుండగా, ప్రస్తుత మేయర్, డిప్యూటీ మేయర్ తమ పదవులను నిలుపుకోవడంలో నిమగ్నమయ్యారు. దీంతో అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్లకు తమ పదవులపై ఉన్న వ్యామోహం, ప్రజాసమస్యలు పరిష్కరించడంపై లేదని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఆస్పత్రిలో చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ అన్నపూర్ణ కాలనీకి చెందిన రజిత అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. ఆస్పత్రిలో చికిత్స చేయించాలని కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కొప్పెర సాయిగౌడ్‌కు వారు తెలియజేయడంతో ఆయన మందముల పరమేశ్వర్‌రెడ్డిని ఆశ్రయించారు. అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి పథకం కింద ఎల్‌ఓసీ ద్వారా రూ.లక్షా ముప్పై వేలను మంజూరు చేయించారు. ఎల్‌ఓసీ పత్రాన్ని వారి కుటుంబ సభ్యులకు బుధవారం పరమేశ్వర్‌రెడ్డి అందజేశారు. మనోహర్, బాలరాజ్‌గౌడ్, ఉపేందర్‌రెడ్డి, సురేష్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించాలి



జలమండలి జీఎం సునీల్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న యూజీడీ, తాగునీటి పనుల గురించి బుధవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లతో కలిసి సైనిక్‌పురిలోని జలమండలి జీఎం సునీల్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సబితఅనిల్‌కిషోర్, నాయకులు జగదీష్‌గౌడ్, అంజయ్య, వెంకన్న, పరమేష్, గిరి, ఉషా తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లకు బదులు టిఫిన్ బాక్స్‌లో చికెన్ ఇవ్వాలి



అల్వాల్‌లో చికెన్ షాప్‌ను సందర్శిస్తున్న జీహెచ్ఎంసీ వెటర్నరీ డాక్టర్ నాగార్జున

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలోని పలు చికెన్ షాపులను బుధవారం జీహెచ్ఎంసీ వెటర్నరీ డాక్టర్ నాగార్జున సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చికెన్, మటన్ షాపులకు వచ్చే కస్టమర్లకు ప్లాస్టిక్ కవర్లకు బదులు టిఫిన్ బాక్స్‌లో చికెన్, మటన్ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అల్వాల్ చికెన్ షాప్ యూనియన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ కొండల్, జీహెచ్ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



గంజాయి విక్రయిస్తున్న బాలుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

అల్వాల్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శంకర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ లోతుకుంటలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో బుధవారం మధ్యాహ్నం తనిఖీలు నిర్వహించగా మల్కాజిగిరికి చెందిన బాలుడు పోలీసులకు చిక్కగా, మరో నిందితుడు మహమ్మద్ పారిపోయాడు. వారి నుంచి రెండున్న కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పల్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



ఉప్పల్‌లో డ్రైనేజీ పనులను పరిశీలిస్తూ..

ఉప్పల్: ఉప్పల్ డివిజన్‌లో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని న్యూశాంతినగర్ హనుమాన్ టెంపుల్ నుంచి ట్రంక్ లైన్‌ను సిల్ట్ గార్బేజ్‌ను ఆధునిక యంత్రం ద్వారా తొలగించే పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. ట్రంక్ లైన్లతో తలెత్తిన ఇబ్బందులతో డివిజన్‌లోని పలు కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ సమస్యలు తలెత్తాయని గుర్తు చేశారు. త్వరలో సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ నాగేందర్, పరమేశ్వర్‌రెడ్డి, కాలనీవాసులు తుమ్మల రాజేందర్, అనిల్ కుమార్, సురేష్, సుబ్బారెడ్డి, సుమన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657